18న టెన్త్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పెదబయలు: పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 18న టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా అధ్యక్షులు జీవన్ తెలిపారు శనివారం ఆయన మాట్లాడుతూ, ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మొత్తం 100 మార్కులకు గాను ఈ టెస్ట్ ఉంటుందన్నారు విజేతలకు మొదటి బహుమతి రూ.5000, రెండవ రూ3000, మూడవ బహుమతి రూ..2000 ఇస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 15వ తేదీ లోపు తమ పేర్లను రూ.30 చెల్లించి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 18న టాలెంట్ టెస్ట్ పలు మండలాల్లో జరుగుతుందన్నారు. ఆ మండలాలు పాడేరు, హుకుంపేట, జి మాడుగుల సెల్ :9391252685, 7672028902, 8500886388, పెదబయలు, ముంచింగిపుట్టు ఫోన్: 6300479480, 8074119934, 7569452438 అరకువేలి, అనంతగిరి, డుంబ్రిగుడ ఫోన్: 8919121090, 6300479480, చింతపల్లి, కొయ్యూరు, జికె వీధి 8074119934, 7569787732, 9493584713 నంబర్స్‌కు చరవాణి ద్వారా సంప్రదించాలన్నారు.

చెట్టు కింద కూర్చున్న గిరిజనులు

గంటల తరబడి నిరీక్షణ

- -పథకాల ఆన్‌లైన్‌కు అందని సెల్ సిగ్నల్స్
- -చెట్టు కిందే సచివాయ సిబ్బంది పాట్లు
- -పట్టించుకోని అధికారులు
- -మాదల పంచాయతీ గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోనీ మాదల పంచాయతీ పరిధిలోని గ్రామాలకు సెల్ సిగ్నల్స్ అందక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. సెల్ సిగ్నల్స్ కోసం నాలుగైదు కిలో మీటర్ల దూరం వెళ్లవసిందే.ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆన్‌లైన్ చేసుకోవడం ఇబ్బందికరంగా ఉందని, సిగ్నల్ లేక ఇబ్బందులు తప్పడం లేదని గిరిజనులు ఆవేధన వ్యక్తం చేశారు. ఈ పరితిస్థి మండలంలోని మాదల పంచాయతీలో నెలకొంది.సెల్ టవర్ ఉన్నప్పటికీ అది పని చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మాదల పంచాయతీ ముల్యగలుగు రెవెన్యూ గ్రామ పరిధిలోని మజ్జివలస, నందివలస, దుమ్మగుడ్రి తదితర గ్రామస్థులకు ఈ మధ్య కాలంలో ప్రభుత్వ రీ సర్వేలో భాగంగా శాశ్వత భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ పట్టాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవడం కోసం బయోమెట్రిక్ ఈకేవైసి చేసుకోవాలి. లేకపోతే రైతు భరోసా వివిధ ప్రభుత్వ పథకాలు రావు. దీంతో, ప్రతీ రోజు చెట్ల కిందకు వెళ్లి సిగ్నల్స్ కోసం నిరీక్షిస్తున్నారు.

పంచాయితీ పరిధిలో రెండు సెల్ టవర్ల ఏర్పాటు చేసినా పని చేయలేదు. దీంతో చెట్టు కిందనే సచివాలయ ఉద్యోగులు, వాలెంటీర్లు విధులు నిర్వహణ చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇంటర్‌నెట్ సేవలు అందించాలని గ్రామస్థులు, ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.

హామీలు గాలికి..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వైఎస్.షర్మిల విమర్శలు
- చింతపల్లి, నాతవరంల్లో కాంగ్రెస్ సభలు
- పలువురు పార్టీలో చేరిక

ప్రజాశక్తి - చింతపల్లి, నర్సీపట్నం టౌన్ విలేకరులు

'మాట తప్పను.. మడమ తిప్పను' అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని, మరోవైపు కేంద్ర బిజెపి ఎపి ప్రజలకు అన్నింటా మోసం చేసిందని ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల విమర్శించారు. అల్లూరి జిల్లా చింతపల్లిలోనూ, అనకాపల్లి జిల్లా నాతవరం మండలం ములగపూడి గ్రామంలోనూ శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల జరిగిన సభల్లో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శల వర్షం కురిపించారు. జగన్ జాబ్ క్యాలెండర్ పేరిట నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఎపికి ప్రత్యేక హోదా తీసుకురాకుండా ఈ ఐదేళ్లు ఎంపీలు గాడిదలు కాసారా ? అని ఆంధ్ర పార్లమెంట్ సభ్యులను ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం ఎంపీలు ఎందుకు రాజీనామాలు చేయలేదన్నారు. మద్యం లేకుండా చేసి ఓట్లు అడుగుతామన్న జగన్ మోహన్ రెడ్డి సర్కారే నేడు మద్యం అమ్ముతోందన్నారు. రాష్ట్రంలో అమ్ముతున్న బ్రాండ్లు తాగి 25 శాతం మంది లివర్ చెడిపోయి చనిపోతున్నారని ఆరోపించారు. తన పుట్టింటికి అన్యాయం జరుగుతోందని భావించి ఎపిలో అడుగుపెట్టానన్నారు. రాష్ట్రంలో భూ కబ్జాలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు బిజెపికి లొంగిపోయాయని అన్నారు. ఒక ఎంపీ, ఎమ్మెల్యే లేకపోయినా ఎపిలో బిజెపి రాజ్యమేలుతోందని తెలిపారు. టిడిపి, వైసిపిలతో బిజెపి ట్రయాంగిల్ లవ్ స్టోరీ నడుపుతోందన్నారు. ఎన్నికల్లో రాజకీయ నాయకులు పంచే డబ్బు ప్రజలదే అన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కోరుకునే వారంతా కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్నారు. ఆయా సభల్లో మాజీ పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, మాజీ కేంద్ర మంత్రులు జెడి శీలం, ఎం.పల్లంరాజు, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్, పిసిసి రాష్ట్ర కార్యదర్శి రుత్తల శ్రీరామ్మూర్తి, సీనియర్ నాయకులు మీసాల సుబ్బన్న, వేగి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం

షర్మిల సభలతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపైంది. చింతపల్లిలో జరిగిన సభకు సుమారు 5 వేల మంది గిరిజనులు తరలివచ్చారు. అక్కడ సభలోనే రాష్ట్రంలో పోటీ చేసే తొలి కాంగ్రెస్ అభ్యర్థిని షర్మిల ప్రకటించారు. పాడేరు అభ్యర్థిగా వంతల సుబ్బారావు పేరును ప్రకటించి కార్యకర్తల్లో ఆమె ఉత్సాహం నింపారు. అల్లూరి సీతారామరాజు గురించి పదేపదే చెబుతూ ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ట్రైకార్ ఛైర్మన్ బుల్లిబాబు

పాడేరు నియోజకవర్గంలో వైసిపికి గట్టి షాక్ తగిలింది. పార్టీ ఆవిర్భావం నుంచీ ఆ పార్టీకి విధేయునిగా ఉంటూ వచ్చిన ప్రస్తుత ట్రైకార్ ఛైర్మన్ శతక బుల్లిబాబు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. 2014 సార్వత్రిక ఎన్నికలలో గిడ్డి ఈశ్వరి, 2019 ఎన్నికలలో కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మిలు ఎమ్మెల్యేలుగా గెలుపొందేందుకు బుల్లిబాబు కృషి చేశారు. 2024లో తనకు టిక్కెట్ వస్తుందని ఆయన ఆశించారు. నెరవేరే ఆశ కనిపించకపోవడంతో 70 మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు.

సభలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

అత్యాచార నిందితున్ని కఠినంగా శిక్షించాలి

సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నేతల డిమాండ్

ప్రజాశక్తి-పెదబయలు:

మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ పరిధి లకేపుట్టు గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన మర్రి సూరిబాబును కఠినంగా శిక్షించాలని ఆదివాసి గిరిజన సంఘం, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. లక్కేపుట్టు గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత తల్లిదండ్రులు మాట్లాడుతూ, అత్యాచారం చేసిన వ్యక్తి తమ కుటుంబ సభ్యులకు సాయంత్రం నాలుగు గంటలకు ఫోన్ చేసి, అడవి ప్రాంతానికి బాలికను తెచ్చి ఉంచానని, ఇక్కడికి వస్తే అప్పగిస్తానని ఫోనులో సమాచారం ఇచ్చాడని అన్నారు వెంటనే బాలిక కుటుంబ సభ్యులు అతను చెప్పినా కొండమీదకు వెళ్లామన్నారు. అత్యాచారం చేసినట్లు ఎవరితోనైనా చెపితే చంపేస్తానని బెదిరించాడని బాలిక చెప్పిందని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. నిందితుడిపై నిర్భయ, ఫోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం, సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, ఆదివాసి మహిళా రాష్ట్ర నాయకురాలు టి కౌసల్య, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు జే.సునీల్ కుమార్, మండల కార్యదర్శి కే.సర్బన్న పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా అధికారులు

బలిమెల రిజర్వాయర్ నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర -ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయంలో నీటి నిల్వలను ఏ రాష్ట్రం ఎంతెంత వినియోగించుకున్నాయో లెక్కలు కట్టారు. ఇరు రాష్ట్రాల అధికారులు ఒడిశా రాష్ట్రం, మల్కనగిరి జిల్లా బలిమెల ఓహెచ్‌పిసి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023-24 నీటి సంవత్సరంలో 2023 జూలై నుంచి 2024 జనవరి 31 వరకు బలిమెల జలాశయం నుంచి ఆంధ్ర తన వాటా 45.7824 టీఎంసీలు నీటిని, ఒడిశా తన వాటా 39.6683 టిఎంసీలు నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఆంధ్ర ఒడిశా కంటే ఇప్పటివరకు 6.1141 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో కలిపి 47.7828 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నట్లు లెక్కలు కట్టారు. ఈ నీటి నిల్వల్లో ఆంధ్రకు 20.8368 టీఎంసీలు, ఒడిశాకు 26.9510 టీఎంసీల నీటిని పంపకాలు చేశారు. ప్రస్తుతం ఇరు రాష్ట్రాలు విద్యుత్తు, ఇరిగేషన్, తాగునీటి అవసరాల నిమిత్తం ఆంధ్రకు 1000 క్యూసెక్కుల నీటిని, ఒడిశా 2300 క్యూసెక్కులు నీటిని బలిమెల జలాశయం నుంచి విడుదల చేయడానికి ఇరు రాష్ట్రాల అధికారులు ఏకగ్రీవంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒడిశా తరపున హైడ్రో ప్రాజెక్టు జనరల్ మేనేజర్లు శివప్రసాద్ (ఎలక్ట్రికల్), కృపా సింధూ బిస్వాల్ (టెక్నికల్ వింగ్), మేనేజర్ ఓఎం.ప్రకాష్‌నాయక్, డిప్యూటీ మేనేజర్ జ్యోతిర్మయోదాస్, అసిస్టెంట్ మేనేజర్ రాజేష్ పాణిగ్రహి, పొట్టేలు ఇరిగేషన్ చీఫ్ కన్స్ట్రక్షన్ ఇంజనీర్ పితా బాస్ శెట్టి, చిత్రకొండ ఎర్త్ డ్యామ్ డివిజన్ ఎస్ఈ రమాకాంత పాత్రో, ఎఈలు గడాదర్ ప్రధాన్, కేసి. పాణి పాల్గొనగా, ఆంధ్ర తరపున ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కేకేవి. ప్రశాంత్ కుమార్, డ్యామ్ అండ్ పవర్ హౌస్ సబ్ డివిజనల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట మధు, ఎఈఈ కె.పావని పాల్గొన్నారు.

టిడిపి శంఖారావాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రంపచోడవరం

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన శంఖారావాన్ని జయప్రదం చేయాలని టిడిపి రంపచోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్ రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రానున్న 40-50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నారా లోకేష్ పర్యటించనున్నారని, ఒక్కరోజులో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. శంఖారావం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను ఇంటరాక్టివ్ సెషన్స్ ద్వారా నోట్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తలు నేరుగా నారా లోకేష్‌తో తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంటుంద వెల్లడించారు.

పోలవరం నిర్వాసితులకు

పరిహారం, పునరావాసం కల్పించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం నిర్వాసితులకు సంపూర్ణంగా పరిహారం, పునరావాసం కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రంపేట రచ్చబండ వద్ద శనివారం జరిగిన సిపిఎం చింతూరు మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీతారాం మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంపూర్ణ అభివృద్ధికి దోహదం చేస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి కాంట్రాక్టర్లపై ఉన్న శ్రద్ధ ఆదివాసీలపైనా, పేదలపైనా ఏ మాత్రం లేదని విమర్శించారు. 2006లో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం కాగా, ఏడాదికి ఏడాది పెరిగిన ధరలకు బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నా నిర్వాసితులకు ఏమాత్రం పరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో ఇళ్లను వరదలకు వదిలి కొండ ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వస్తోందని, ప్రభుత్వం తాత్కాలిక చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

మరో వైపు ఏజెన్సీ ప్రాంతాల చట్టాలకు తూట్లు పొడిచి ప్రాజెక్టుల పేరుతో ఇక్కడి భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలపై వివిధ రకాల పన్నులు, విద్యుత్ చార్జీలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వంటి అనేక రూపాల్లో భారాలను ప్రభుత్వాలు మోపుతున్నాయని తెలిపారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన బిజెపికి నేడు రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు సంపూర్ణ మద్దతు తెలియజేయడం దారుణమన్నారు. తమపై ఉన్న కేసుల నుంచి బయటపడటానికి ఈ పార్టీల నాయకులు స్వామి భక్తిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. మరో వైపు వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించిందని, నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి, మిత్రపక్షాలైన తెలుగుదేశం జనసేన పార్టీలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి సీసం సురేష్, జిల్లా నాయకులు పల్లపు వెంకట్, మండల నాయకులు మల్లం సుబ్బమ్మ, మడకం చిన్నయ్య, ముర్రం రంగమ్మ, పొడియం లక్ష్మణ్, ఎంపిటిసి రాజ్ కుమార్, కారం సుబ్బారావు, పిడకయ్య, కారం కొండయ్య, కారం పొద్దయ్య, పాండు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -సీలేరు

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని సిఐటియు మండల కార్యదర్శి గడుతూరి నారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని పూజారిపాకల గ్రామంలో శనివారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదన్నారు. మిడ్డేమీల్స్ కార్మికులకు నెలకు రూ.10వేలు వేతనం చెల్లించాలని, యూనిఫారం ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని, ఐడి కార్డులు ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అంపరంగి బుజ్జిబాబు, ఎంపిటిసి చిన్నతల్లి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జికె.వీధి మండల కార్యదర్శి సత్యనారాయణ

ఇంటర్వ్యూలకు హాజరైన యువతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎఎస్పి

టాటాలో ఉద్యోగాలకు 412 మంది ఎంపిక

ప్రజాశక్తి-రంపచోడవరం

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రేరణ కార్యక్రమం ద్వారా రంపచోడవరం ప్రశాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాల నియామకం కోసం శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీనికి రంపచోడవరం, దేవీపట్నం, అడ్డతీగల, గంగవరం. వై.రామవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి మండలాల నుండి సుమారు 450 మంది గిరిజన యువతులు హాజరు కాగా అందులో 412 మంది ఎంపికయ్యారు. వీరిని తమిళనాడు రాష్ట్రం, హెరీసూర్ టౌన్‌లో గల టాటా ఐఫోన్ తయారీ కంపెనీకి ఉద్యోగాల కోసం పంపిస్తారు. అన్ని అలివెన్సులు కలుపుకొని నెలకు సుమారు రూ.18వేలు జీతం, పిఎఫ్, మెడికల్ ఫెసిలిటీ, ఇతర బెనిఫిట్స్ కల్పించడం జరుగుతుందని టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎఎస్పి జగదీష్ అడహళ్లి మాట్లాడుతూ, గిరిజన యువతకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఐఫోన్ తయారీ ప్లాంట్లో ఉద్యోగాలు రావడం గొప్ప అవకాశమని తెలిపారు. ఈ ప్రాంతంలోని ఆడపిల్లలందరికీ వీరు ఆదర్శంగా నిలుస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యలో ప్రోత్సహించాలన్నారు. ఇక్కడి సమాజంలో బాల్య వివాహాల తగ్గింపు, ఫలితంగా వచ్చే ఆరోగ్య సమస్యలపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను గిరిజన యువత సద్వినియోగం చేసుకుని కోరారు. ఈ నెల 12న ఎటపాకలోనూ టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థ ఉద్యోగ నియామక ప్రక్రియను చేపడుతుందని, దానిని కూడా జిల్లాలోని నిరుద్యోగ గిరిజన యువతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగునీటి పథకం మోటారుకు మరమ్మతులు

ప్రజాశక్తి-విఆర్.పురం :

మండలంలోని రేఖపల్లి గ్రామపంచాయతీ పరిధి అన్నవరం గ్రామంలోని చెరువు గుంపు వద్ద తాగునీటి పథకం మోటారుకు శనివారం స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని చేతుల మీదుగా మరమ్మతులు చేయించి మంచినీరు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజినీ మాట్లాడుతూ గుంపులో కొన్ని రోజులుగా మోటార్లు చెడిపోయి నీళ్లకి చాలా ఇబ్బంది పడుతున్న ప్రజలు బాధలను చూసి మోటారుకు మరమ్మతులు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ సరోజిని

బహుమతులు ఇస్తున్న ఎస్‌ఐ మనోజ్ కుమార్

వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-పెదబయలు : గిరిజన యువకుల క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సిఆర్‌పిఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో వివిధ క్రీడలు నిర్వహించడం జరుగుతుందని సిఆర్‌పిఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్ సింగ్ అన్నారు. మండలంలోని రుడకోటలో అవుట్ పోస్ట్ సిఆర్‌పిఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 6 జట్లు పాల్గొనగా, ఇందులో కుమడ జట్టు మొదటి బహుమతిని, కాంగ్రంగివలస జట్టు రెండో బహుమతిని గెలుచుకుంది. మొదటి, రెండవ బహుమతి గెలుచుకున్న జట్లకు బహుమతితో పాటు వాలీబాల్ కిట్లను సిఆర్‌పిఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్ సింగ్, డి.ఎస్.పి త్రిలోచన్ బేరా, ఇన్స్పెక్టర్ ఏకే మిశ్రా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న అన్ని జట్లకు వాలీబాల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెదబయలు ఎస్ఐ మనోజ్ కుమార్, రుడకోట పిహెచ్‌సి వైద్యులు కిషోర్, సత్యారావు, మాజీ సర్పంచ్ పండ సుబ్రహ్మణ్యం, సత్యం, గణేష్ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి, సాడేక గ్రామాలలో శనివారం స్థానిక సిఐ రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ, గంజాయి, నాటు సారా వంటి అసాంఘిక కార్యక్రమాలకు యువకులు, గ్రామస్తులు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ వద్దకు తీసుకువస్తే పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో గ్రామాలలో ఎటువంటి గొడవలు, అల్లర్లకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు

'మీడియా-సామాజిక న్యాయం' పై సదస్సు

ప్రజాశక్తి-సీతమ్మధార : అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యాన అంబేద్కర్ భవన్‌లో శనివారం 'మీడియా-సామాజిక న్యాయం' అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభంలో అంబేద్కర్ చిత్రపటానికి అతిథులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ రచయిత, కవి, ఏపీ జర్నలిజం కాలేజీ డైరెక్టర్ సతీష్ చందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పత్రికలు వాస్తవాన్ని వక్రీకరిస్తూ నిజాన్ని మరుగునపడేటట్లు చేస్తున్నాయన్నారు. ప్రచార మాధ్యమాలు బలహీనంగా తమ అభిప్రాయాలను మనువాద రుద్దుతున్నాయని అభిప్రాయపడ్డారు. దేశ వ్యాప్తంగా అనేక అకృత్యాలు ప్రస్తుత మీడియాలో కానరావటంలేదన్నారు. దళితుల బతుకులు, వారి జీవితాలు పత్రికల్లో కనిపించడంలేదన్నారు. అగ్రవర్ణాల చేతుల్లో ఉన్న కొన్ని పత్రికలు పార్టీలకు కొమ్ము కాస్తూ వారిని రాజకీయంగా ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. స్వాతంత్ర పోరాటంలో దళితులను చైతన్యవంతం చేసేందుకు అంబేద్కర్ మూక్ నాయక్ పత్రికను స్థాపించారని తెలిపారు. మతోన్మాద ప్రాపర్టీలు దేశమంతా దేశభక్తి అంటే రాముడు అని ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రధాన మీడియా ఇదే చూపిస్తోందని విమర్శించారు. బహుజనులు ప్రచార మాధ్యమాల ద్వారా అంబేద్కర్ ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు.

ఏయూ జర్నలిజం విభాగం పూర్వ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.బాబివర్ధన్ మాట్లాడుతూ, 'మూక్ నాయక్' పత్రికను అగ్రవర్ణాల పత్రికలకు ధీటుగా ఆనాడు అంబేద్కర్ నడపడం సాహసోపేతమని కొనియాడారు. నేడు మీడియా ఫోర్త్ ఎస్టేట్‌గా కాకుండా రియల్ ఎస్టేట్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'లీడర్' సంపాదకులు వీవీ.రమణమూర్తి మాట్లాడుతూ, నేడు మతవాదులు అంబేద్కర్ రాజ్యాంగాన్ని తీసివేసి మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి కుట్ర పన్నుతున్నారని, అందరూ జాగరూకతతో వ్యవహరించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సొసైటీ అధ్యక్షులు బొద్దు కళ్యాణరావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనే దేశానికి జర్నలిజం వచ్చిందని, అది అంబేద్కర్ అందిపుచ్చుకొని ఆనాటి బహిష్కృత వర్గాల సమస్యలను వెలుగులోకి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్ సీనియర్ జర్నలిస్ట్ జికెడి.ప్రసాద్, ఏయూ ప్రొఫెసర్ పీడీ సత్యపాల్, డాక్టర్ ప్రసాద్, ప్రొఫెసర్ ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ లేక అవస్థలు

- స్కూల్‌లో చేరేందుకు ఇబ్బందులు
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -అనంతగిరి:దేశంలో నివసిస్తున్న ప్రతి ఒక్క పౌరుడుకు ఆధార్ కార్డు తప్పనిసరి అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెపుతున్నప్పటికీ అవి మాత్రం గిరిజన విద్యార్థులకు అందలేదు. నేటికీ కనీస ఆదార్ కార్డు లేక విద్యకు దూరమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలు, వాలంటరీ వ్యవస్థను గ్రామాల్లో అందుబాటులోకి తెచ్చి అన్ని రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ప్రకటనల్లో చెపుతుంది తప్ప ఆచరణలో అమలు కాలేదు.అనంతగిరి మండలం మారుమూల పెద్దకోట పంచాయతీ పరిధి చింతలపాలెం గ్రామంలో 25 కుటుంబాలు నివసిస్తున్నారు. ఎంపీపీఎస్ పాఠశాల ఉన్నప్పటికీ పిల్లలకు ఆదార్ కార్డు అనుసంధానం లేక పోవడంతో బడిలో ఆన్లైన్ అడ్మిషన్ చేసుకునేందుకు వీలు లేకపోయింది. ఆ గ్రామానికి చెందిన సప్పి, నాగమణికు జన్మించిన పిల్లలు సప్పి నాగమణి, సప్పి వినోద్, సప్పి కుమారి, పెండెల. మహేష్, మామిడి. సింహాద్రి, రాము, చింత శ్రావణి, చింత నందినీలు ఐదు నుండి ఆరు సంవత్సరాలు పైబడి ఉన్నారు.

ఆధార్ కార్డు లేని పిల్లలు

నేటి వరకు ఆ పిల్లలకు కనీస ఆధార్ కార్డు లేక పోవడంతో విద్యా బోధనలకు దూరమయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ పిల్లలకు ఆధార్ చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించండి

మాజీ మంత్రి మణికుమారి

మాట్లాడుతున్న మణికుమారి

ప్రజాశకి-పాడేరు:పాడేరు ఏజెన్సీలో గత రెండుసార్లు అండగా నిలిచి అధికారం ఇచ్చిన గిరిజనులను వైయస్సార్సీపి ప్రభుత్వం మోసగించిందని, ఈ ఎన్నికల్లో గద్దె దించాలని తెలుగుదేశం పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్టగుల్లి సుబ్బారావు, మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి పిలుపునిచ్చారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటనలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్ర, శని వారాలు పాడేరు, జిమాడుగుల మండలాల్లోని గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ తన పాదయాత్రలో అమలు చేయలేని ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక మోసగించారని విమర్శించారు. గత ఐదేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం అభివద్ధిని విస్మరించిందని చెప్పారు. విభజన హామీలను అమలు చేయించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని అన్ని విధాల రాష్ట్ర ప్రజలను వైసీపీ మోసగించిందని గిరిజన ప్రాంతాల్లో అభివద్ధి మరింత అడుగంటిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వంజరి గెమ్మెలి పంచాయతీ గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ జడ్పీ చైర్మన్ కాంతమ్మ, మాజీ ఎంపీపీ ముత్యాలమ్మ, మాజీ సర్పంచ్ పెన్నయ్య దొర, నాయకులు బొర్రా విజయరాణి, నాగబ్బాయి, మత్స్యరాజు, మాజీ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన సిమెంట్ లారీ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్
మండలం లోని సుంకరమెట్టం పంచాయితీ ఎస్.బెడ్డగుడ గ్రామ సమీప మలుపు వద్ద విశాఖపట్నం నుంచి అరకులోయ వస్తున్న సిమెంట్ లారి అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొంది. ఈ సంఘటన శనివారం తెల్లవారు జాము 5గంటల సమయంలో జరిగినట్టు స్థానికులు తెలిపారు. దట్టమైన పొగ మంచు కమ్మేయడంతో రోడ్డు కనిపించలేదని డ్రైవర్ తెలిపారు.రక్షణ గోడ ఉండటంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు.

రోడ్డు పక్కన రక్షణగోడపై ఎక్కిన లారీ

నేరాలు ఘోరాలు

పర్యాటకుల కారు దగ్ధం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని వంజరి గ్రామ సమీప రహదారి మధ్యలో శనివారం మధ్యాహ్న సమయంలో పర్యాటకుల కారు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల గ్రామానికి చెందిన పర్యాటకులు లంబసింగి, అరకు అందాలను తిలకించేందుకు వచ్చారు. లంబసింగి పర్యాటక ప్రాంతాలు చూసి తిరిగి అరకు వెళ్లే మార్గమధ్యలో వంజరి గ్రామ సమీపంలో ఘాటి వద్దకు వచ్చేసరికి కారు ప్రమాదానికి గురైంది.ఐదుగురు పర్యటకులు కారులో ఉండగా ముందుగా పొగలు రావడంతో దిగి పారిపోవడంతో ఎవరికి ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. కారు మాత్రం పూర్తిగా కాలి బూడిదైంది.ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

దగ్ధమవుతున్న కారు

104 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి సరిపల్లి జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించే క్రమంలో మహారాష్ట్రకు చెందిన ఇన్నోవా వాహనంలో అక్రమంగా తరలుతున్న 104 కిలోల గంజాయిని పోలీసులు శనివారం పట్టుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ వెంకటరావు సారథ్యంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ టాస్క్‌ఫోర్స్ వి.ప్రసాదరావు, సిఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పాటు ఇన్నోవా కారును, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం పెందుర్తి పోలీసులకు నిందితులను అప్పగించారు.

మద్యం అక్రమ నిల్వలు పట్టివేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టాస్క్‌ఫోర్సు ఎసిపి వి.ప్రసాదరావు, సిఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని ఓ ఇంటిపై పోలీసులు దాడి చేసి అక్రమంగా ఉన్న 88 బాటిళ్ల డిఫెన్స్ మద్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మనబాలపాలెం గ్రామానికి చెందిన బొడ్డపు శ్రీను రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... శనివారం ఉదయం మనబాలపాలెం నుండి జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి వస్తుండగా వెనుక నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే శ్రీను మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు.

కారిడార్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, నిర్వాసితులు, నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని రాజయ్యపేట పంచాయతీ శివారు బోయపాడులో శనివారం నిర్వాసితులు, నాయకులు సమావేశం నిర్వహించారు. 2013 భూసేకరణ చట్టప్రకారం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రతీ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. ప్రతీ సెంటు భూమికి పరిహారం, ప్రతీ నిర్వాశితుడికి రూ. 15 లక్షల ప్యాకేజీ, ఇల్లు కోల్పోయిన వారికి 25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోతున్నవారికీ అనువైన ప్రదేశంలో ఇల్లు స్థలాలు ఇవ్వాలని తెలిపారు. మత్స్యకారుల ఉపాధికి ఫిషింగ్ జెట్టి నిర్మించాలని,సాగు భూములకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు.ప్రజలకు హాని కలిగించే బల్క్ డ్రగ్ యూనిట్‌లను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేసిన తర్వాత మాత్రమే పనులు చేపట్టాలని, అప్పటివరకు నిలుపుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బుచ్చిరాజుపేట, అమలాపురం సర్పంచ్‌లు కాళ్ళ శ్రీనివాసరావు, పెదపూడి శంకర్రావు, రాజయ్యపేట ఉప సర్పంచ్ కొండలరావు, నాయకులు ఎం.రాజేష్, వి.శివ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

ధాన్యం డబ్బులు చెల్లించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : వ్యవసాయ శాఖ, వెలుగు అధ్వర్యంలో కోనుగోలు చేసిన ధాన్యానికి రావలసిన బిల్లులు రైతులకు వెంటనే చెల్లించాలని ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. రేఖపల్లిలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసి వారాలు గడుస్తున్నా రైతులకు చెల్లించాల్సిన డబ్బులు పెండింగ్ పెట్టడం సరికాదని పేర్కొన్నారు. మండలంలో కోనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు సిహెచ్ సుబ్బారావు, గుండెపూడి లక్ష్మణరావు, సోడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఎఎస్‌పిలు

ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు : అల్లూరి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఎఎస్‌పిలు కె.వి.మహేశ్వర రెడ్డి, రాహుల్ మీనా శనివారం ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం చింతూరు నుండి ఏడుగురాళ్లపల్లి మీదుగా అల్లిగూడెంకు వెళ్తుంది. గిరిజన ప్రాంతంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను, ఆటోలు, ఇతర రవాణా వాహనాల్లో ప్రయాణించేటప్పుడు తరచుగా ప్రమాదాలు జరుగుతున్న పరిస్థితిని పరిగణనలోకి పోలీసు శాఖ చొరవ తీసుకొని ఈ బస్సును ఏర్పాటు చేసింది. ఈ బస్సు సౌకర్యం ద్వారా ఎపిలోని గ్రామాల వారే కాకుండా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా సరిహద్దు ప్రాంతానికి చెందిన ప్రజలు ముఖ్యంగా గుత్తికోయ, ఏడుగురాళ్లపల్లి, చింతూరులోని షాండీలను సందర్శించే వారు ప్రయోజనం పొందుతారు. చింతూరు నుండి అల్లిగూడెం, మల్లంపేట, సిజి సరిహద్దుకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఎస్‌పిలు కోరారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో చింతూరు సర్కిల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.గజేంద్ర కుమార్, ఎస్‌ఐ డి.శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో చేరిన మల్లు దొర మనవడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్వాతంత్ర్య సమరయోధుడు గాం మల్లుదొర మనవడు గాం బోడిదొర ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురవ్వగా ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశాల మేరకు మెరుగైన చికిత్స అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు చికిత్స నిమిత్తం శనివారం కెజిహెచ్‌లో ఆయనను చేర్పించారు. ఆయన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందివ్వాలని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శంకరరావును ఆదేశించారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లకు సాంకేతిక అడ్డంకులు

సర్వర్ మొరాయింపు
సచివాలయాల వద్ద లబ్ధిదారులు నిరీక్షణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి
జిల్లాలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వర్లపై ఒత్తిడి పెరగడంతో ఎక్కువ సమయం లబ్ధిదారులు సచివాలయాల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో జిల్లాలో 54 వేల మందికి ప్రభుత్వం పట్టాలు జారీచేసింది. వీటన్నింటినీ లబ్ధిదారుల పేర రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ సచివాలయాల్లో ఇంటర్నెట్ సరిగా లేకపోవడం, సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో పట్టాల రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగుతున్నాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించినా ఇంతవరకు 20 శాతం కూడా పూర్తికాలేదు. ఇళ్ల పట్టాల మంజూరులో లబ్ధిదారునిపేరు, హద్దులు సరిగా నమోదు చేయకపోవడంతో రిజిస్ట్రేషన్ వేగవంతంగా చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ ఒక సచివాలయంలో 50 వరకు పట్టాలు రిజిస్ట్రేషన్లు జరగాల్సివుండగా సాంకేతిక సమస్యలతో పది రిజిస్ట్రేషన్లు కూడా కావడంలేదు. దీంతో ఉద్యోగులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. సకాలంలో రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చొని రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో రెండోరోజు రావాల్సి వస్తోంది. ఈ నెల ఒకటి నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించి 18 నాటికి ముగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గడువులోగా విధించిన లక్ష్యాల ప్రకారం రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని ఉద్యోగులు ఎంత ప్రయత్నించినా సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో పని మందకొడిగా సాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో తలెత్తిన సమస్యలతో గడువులోగా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యే అవకాశం కనిపించడంలేదు. దీంతో తమ పట్టాలు గడువులోగా రిజిస్ట్రేషన్లు అవుతాయో, లేదోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం సాంకేతిక సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం నిర్ధేశించిన గడువులోగా రిజిస్ట్రేషన్లు పూర్తిచేస్తామని చెబుతున్నారు.

యలమంచిలి మున్సిపాలిటీ పరిధి 20వ వార్డులో సాగుతున్న రిజిస్ట్రేషన్లు

ఎపిఇపిడిసిఎల్‌కు రెండు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : వినియోగదారులకు సేవలందించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్)కు రెండు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఇప్పయ్) ఆధ్వర్యంలో కర్ణాటకలోని బెల్గాంలో శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ మేరకు ఎపిఇపిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తరపున సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం ఈ అవార్డులను అందుకున్నారు. ఇంధన రంగంలో విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించేందుకు ఉద్దేశించబడిన సరికొత్త కృత్రిమ మేధ (ఎఐ), మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ వంటి అంశాలపై చర్చించేందుకు బెల్గాంలోని శూన్య ఫార్మ్ రిట్రీట్‌లో ఇప్పయ్ ఆధ్వర్యంలో '24వ రెగ్యులేటరీ అండ్ పాలసీమేకర్స్ రిట్రీట్' పేరిట ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు సదస్సు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం జరిగిన ఇప్పయ్ పవర్ అవార్డ్స్-2024 ప్రదానోత్సవ కార్యక్రమంలో ఇంధన రంగంలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. సంస్థ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు ఎపిఇపిడిసిఎల్ జాతీయ స్థాయిలో అవార్డును కైవసం చేసుకుంది. దీంతో పాటు వినియోగదారుల్లో అవగాహన పెంపుదల అంశంలోనూ అవార్డును సొంతం చేసుకుంది. రెండు జాతీయ అవార్డులు లభించడం పట్ల సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖల సహకారంతో ఇపిడిసిఎల్‌లో పలు రకాల పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సంస్థ ఉద్యోగులు, సిబ్బంది అత్యుత్తమ పనితీరుకు నిదర్శనంగా సంస్థ జాతీయ అవార్డులను సొంతం చేసుకుందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో వినియోగదారులకు మరిన్ని నాణ్యమైన సేవలందిస్తామన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారికి సైతం విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ, సంస్థను అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు కృషి చేస్తామని తెలియచేశారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మేరీ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1045వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఆశా వర్కర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో మంది ప్రజల త్యాగాలతో, పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేసేందుకు మోడీకి హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. మోడీ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ పరిశ్రమలకు కాపలాదారుడు మాత్రమేనన్నారు.

బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్క ప్రభుత్వరంగ సంస్థనూ స్థాపించలేదన్నారు. దీక్షల్లో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి, కోశాధికారి వై.సీతారత్నం, సరోజిని, కె.ఆదిలక్ష్మి, కె.నవ్య, బి.లీలావతి, పి.పార్వతి, బి.భారతి తదితరులు పాల్గొన్నారు.

గోతులు పూడుస్తున్న స్థానికులు

శ్రమదానంతో రహదారి గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం, జెర్రెల పంచాయితీ పరిధి జెర్రెల కొత్తూరు గ్రామానికి వెళ్లే మట్టి రహదారిలో గోతులను స్థానికులు శ్రమదానంతో పూడ్చారు. జెర్రెల కొత్తూరు గ్రామానికి బిటి రహదారి నిర్మాణం చేయాలని స్థానికులు ఎన్నో పోరాటాలు చేసినా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం పట్టించుకోలేదు. ఉన్న మట్టి రహదారి పెద్ద పెద్ద గోతులుగా మారడంతో వాహనాల రాకపోకలు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో తామే శ్రమించి రహదారి గుంతలను పూడ్చుకుంటున్నామని గిరిజనులు చెప్పారు. రాజకీయ నాయకులు వాగ్దానాలు చేయడం తప్పా రహదారి నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడ్డారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలు రాజకీయ నాయకులకు, అధికారులకు పట్టవా అని వారు ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదనడానికి తమ రహదారుల దుస్థితిని చూస్తే తేటతెల్లమవుతుందని వారు అంటున్నారు. రహదారి సౌకర్యం లేక ఆస్పత్రికి, మండల కేంద్రానికి వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి రవాణా సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం మద్దులూరు వద్ద శనివారం పెను ప్రమాదం తప్పింది. మద్దులూరు గ్రామ సమీపాన ప్రైవేట్ అంబులెన్స్ అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కరెంట్ తీగలు గోకవరం నుండి పాతకోట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై పడ్డాయి. ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంపై ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. మారేడుమిల్లి ఎలక్ట్రికల్ సిబ్బంది సమయానికి స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

వైసిపి తొత్తుగా విశాఖ కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున అధికార వైసిపికి తొత్తుగా పని చేస్తున్నారని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆరోపించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ మల్లికార్జునను ఎన్నికల విధుల నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి, ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నగరంలో వందల కోట్ల విలువైన దసపల్లా, హయగ్రీవ భూములు కలెక్టర్ నిర్వాకంతో అధికార పార్టీ నేతల పరమయ్యాయన్నారు. అధికార పార్టీ నేతలకు అనుకూలంగా విఎంఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్ మార్పు జరిగిందన్నారు. రామానాయుడు స్టూడియోలో ఇళ్ల కోసం లే అవుట్ వేసారన్నారు. టిడిపి సానుభూతిపరుల ఓట్లను ఇష్టానుసారంగా తొలగించేశారని తెలిపారు. దొంగ ఓట్లను ఇష్టానుసారంగా చేర్చారని విమర్శించారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బైరెడ్డి పోతన్న రెడ్డి, బొట్టా వెంకటరమణ, పార్టీ నాయకులు ఒమ్మి అప్పారావు, శివ, దువ్వి స్వామి, రాజశేఖర్, ఒమ్మి అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత స్వీకరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ నిబంధనలను అనుసరించి స్వీకరించే దత్తతలే ఉత్తమైనవని కేంద్ర ప్రభుత్వ దత్తత వనరుల సంస్థ (కారా) న్యూఢిల్లీ ప్రోగ్రాం డైరెక్టర్ జగన్నాథ పతి అన్నారు. శనివారం హోటల్ రాయల్ ఫోర్ట్‌లో కారా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల దత్తత వనరుల సంస్థ (సారా), ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగాలు సంయుక్తంగా చట్ట బద్ధ దత్తతలపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించాయి.